
క్షణికావేశం.. తీస్తోంది ప్రాణం

- ప్రేమ, చదువులు, ర్యాంకులు, ఒత్తిడితోనే తనువు చాలిస్తున్న యువత
- ఉన్నత చదువుల కోసం తల్లిదండ్రులకు, స్నేహితులకు దూరంగా ఉండాల్సి రావడం కూడా కారణమే

అమ్మనాన్నల చెంత.. స్నేహితులతో కలిసి గడుపుతూ స్కూల్‌కు వెళ్లిన విద్యార్థులు ఎన్నో ఆశలతో ఉన్నత చదువుల కోసం సుదూర ప్రాంతాల్లో ఉండే కళాశాలలో చేరుతున్నారు. ఒక్కసారిగా అయిన వారు పక్కన లేరనే భావన.. స్నేహితులు లేరనే బాధ.. కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు చదువులు..ర్యాంకుల పేరిట పెట్టే ఒత్తిడి ఆత్మహత్యలకు ప్రేరేపిస్తున్నాయి. చిన్నచిన్న కారణాలతో క్షణికావేశంలో జీవితాన్ని ఛిద్రం చేసుకుంటున్న విద్యార్థులను ఇటీవల కాలంలో మనం చాలామందినే చూస్తున్నాం. తల్లిదండ్రుల ఆశలను, ఆశయాలను, భావి లక్ష్యాన్ని మరచి అనవసర ఒత్తిళ్లకు లోనై తనువు చాలిస్తున్నారు.

- మానసిక వికాసం, మనోధైర్యం పెంచే కార్యాచరణ కరువు
- కళాశాలల్లో కొరవడిన పర్యవేక్షణ, నిరంతర నిఘా
- తీవ్ర ఒత్తిడికి గురవుతున్న హాస్టళ్లలో ఉండే విద్యార్థులు
- పర్యవేక్షణ, కౌన్సెలింగ్ తప్పనిసరి అంటున్న డాక్టర్లు, మేధావులు
- తల్లిదండ్రులకు తీరని శోకం మిగుల్చుతున్న పిల్లల ఆత్మహత్యలు

తిరుపతి సిటీ: విద్యార్థి జీవితం మలుపు తిప్పే కీలక దశ ఇంటర్మీడియెట్. ఈ దశలో విద్యార్థులపై తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యాలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. జీవితాన్ని ఉన్నత లక్ష్యం వైపు మలుచుకోవాలన్నా, చెడు వ్యసనాలకు లోనై భవిష్యత్‌ను పాడు చేసుకోవాలన్నా ఈ దశే విద్యార్థికి కీలకం. ఆత్మహత్యల వైపు విద్యార్థులను ప్రేరేపించేది ఇంటర్మీడియెట్ దశలోనే. అంతర్జాతీయ బాలల హక్కుల పరిరక్షణా సంస్థ గత ఏడాది వెలువరించిన గణాంకాల ప్రకారం 17–21 ఏళ్ల మధ్య వయసు గల యువత 57 శాతం సూసైడ్ చేసుకుంటున్నారని, 22–35 ఏళ్ల యువత 21శాతం ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తేల్చింది. ఇందులో చదువులపై ఒత్తిడి, పోటీతత్వం, ప్రేమ వ్యవహారాలు, ఆర్థిక సమస్యలు, నిరుద్యోగ సమస్య, సరైన సలహాలు లేకపోవడమే ప్రధాన కారణాలుగా గుర్తించింది.



సర్దిచెప్పే వారు లేక..

పిల్లల అందమైన జీవితాన్ని కన్నులారా చూసే భాగ్యాన్ని తల్లిదండ్రులు కోల్పోతున్నారు. ప్రధానంగా ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్, డిగ్రీ కళాశాలల వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులు అధికసంఖ్యలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. సరైన పర్యవేక్షణ లేక, సర్దిచెప్పే తల్లిదండ్రులు దగ్గర లేకపోవడం యువత పాలిట శాపంగా మారుతోంది. వచ్చిన సమస్యకు పరిష్కార మార్గాన్ని కనుగొనలేక సతమతమవుతూ సూసైడ్ చేసుకోవడమే శరణ్యం అన్నట్లు వ్యవహరించడం ఆందోళన కలిగిస్తోంది. హాస్టళ్లలో భద్రతా వైఫల్యం, పర్యవేక్షణాలోపం వల్లే బలవన్మరణాలకు యువత పాల్పడుతోందని డాక్టర్లు, మేధావులు తేల్చి చెబుతున్నారు.

ఇవీ అవసరం..

- ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం క్రమం తప్పకుండా వసతి గృహాలను తనిఖీ చేయాలి
- పర్యవేక్షకుల సంఖ్య పెంచి నిరంతర నిఘా ఉంచాలి
- హాస్టళ్లలో విద్యార్థులను ఒంటరిగా ఉండకుండా చర్యలు చేపట్టాలి
- సీలింగ్ ఫ్యాన్లను తొలగించి, పెడస్టల్, గోడకు టేబుల్ ఫ్యాన్‌లను ఏర్పాటు చేయాలి
- నిపుణులతో జీవిత లక్ష్యాలపై కౌన్సెలింగ్ ఇప్పించాలి
- విద్యార్థి వ్యక్తిత్వ వికాసాన్ని గమనిస్తూ సమస్యలు ఉత్పన్నమైనప్పుడు చర్చించి తల్లిదండ్రులకు సమాచారం అందించాలి
- క్రమం తప్పకుండా పేరెంట్స్ మీటింగ్‌లు ఏర్పాటు చేయాలి
- ప్రైవేటు కళాశాలల వసతి గృహాల్లో ర్యాంకుల పేరుతో విద్యార్థులపై ఒత్తిడి పెట్టడం ప్రమాదం
- నిరంతరం సెల్‌ఫోన్‌లలో మాట్లాడడం, మెసేజ్‌లు, చాటింగ్‌లలో ఎక్కువసేపు గడుపుతున్న విద్యార్థులపై ఇటు తల్లిదండ్రులు, అటు కళాశాల యాజమాన్యాలు నిఘా పెట్టాలి.

ప్రత్యేక దృష్టి పెట్టాలి



మానసిక ఉల్లాసం కోసం క్రీడలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, సాంస్కృతిక కార్యక్రమాలపై విద్యార్థులను ప్రోత్సహించాలి. యుక్త వయసు విద్యార్థులకు సమాజం పట్ల అవగాహన ఉండదు. భవిష్యత్ లక్ష్యాన్ని నిర్ణయించుకునే పరిపక్వతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి. డాక్టర్, కలెక్టర్, ఇంజినీర్ కావాలని పిల్లలపై ఒత్తిడి చేయకూడదు. వారికి ఎందులో ప్రావీణ్యం ఉందో గమనించి ప్రోత్సహించాలి. డ్యూయల్ కెరియర్, ఫ్లోటింగ్ ఆఫ్ మనీ, ఎలక్ట్రానిక్ డివైజెస్, దురలవాట్లు, ప్రేమపేరుతో వంచనలే ఆత్మహత్యలకు ప్రధాన కారణాలు.

– ఎస్.విశ్వనాథరెడ్డి, సైకాలజీ ప్రొఫెసర్, ఎస్వీయూ

తల్లిదండ్రుల పాత్ర కీలకం



17 నుంచి 23 ఏళ్ల వయస్సులోపు వారే ఎక్కువగా ఆత్మహత్యల వైపు ప్రేరేపితులవుతారు. పాఠశాల విద్య వరకు ఇంటి దగ్గర ఆడుతూ పాడుతూ తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులతో సంతోషంగా గడిపిన వారు ఒక్కసారిగా ఇంటర్, డిగ్రీ చదువుల కోసం సుదూర ప్రాంతాల్లో హాస్టళ్లలో ఉండాల్సి రావడం.. అక్కడ తల్లిదండ్రుల ఆత్మీయత, ప్రేమానురాగాలు దొరకవు. పర్యవేక్షణ, కౌన్సెలింగ్ తూతూమంత్రమనే చెప్పాలి. హోమ్ సిక్‌తో బాధపడే పిల్లలను తల్లిదండ్రులు హాస్టళ్లలో చేర్పించకపోవడమే మంచిది.

– రాజశేఖర్‌రెడ్డి, రిటైర్డ్ ప్రిన్సిపల్, తిరుపతి

కడుపుకోత మిగిలింది...



మా అబ్బాయి విజయవాడలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ బైపీసీ చదువుతుండేవాడు. వారానికి ఒక్కసారి మా అబ్బాయిని చూడడానికి కళాశాలకు వెళ్తే.. ఎందుకు వస్తున్నారు ?. రెండు నెలలకు ఒక్కసారి రావాలి.. అంటూ ఆంక్షలు పెట్టారు. మా అబ్బాయిది చాలా సున్నిత మనసు. అన్ని విషయాలు యాజమాన్యాలకు చెప్పినా మేము చూసుకుంటాం అని ప్రగల్భాలు పలికారు. కనీసం నెలకు ఒక్కసారైనా ఫోన్‌లో మాట్లాడించే వారు కాదు. దీంతో ఒత్తిడికి లోనై మా అబ్బాయి ఉరివేసుకుని గత ఏడాది తనువు చాలించాడు. పిల్లోడి భవిష్యత్ బాగుంటుందని ప్రైవేటు కళాశాలలో చేరిస్తే మాకు కడుపు కోత మిగిల్చాడు.

– కళావతమ్మ, తిరుపతి

క్లుప్తంగా

బంగారు తిరుచ్చిపై శ్రీకృష్ణుడు



బంగారు తిరుచ్చి భక్తులకు దర్శనమిస్తున్న రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారికి అనుబంధంగా వెలసిన శ్రీకృష్ణ స్వామివారు, అమ్మవార్లతో కలసి ఆదివారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. స్వామివారి జన్మనక్షత్రం రోహిణి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు ఉదయం సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను సర్వాంగ సుందరంగా అలంకరించారు. తదుపరి సాయంత్రం శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణ స్వామివారు బంగారు తిరుచ్చిపై ఆసీనులై నాలుగు మాడవీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. కార్యక్రమంలో ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్ వల్లంశెట్టి రమేష్ బాబు, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, జమేదారు చిరంజీవి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

24న ఆర్యవైశ్యుల కార్తీక వనభోజనం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: శివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన కార్తీక మాసాన్ని పురస్కరించుకుని తిరుపతి ఆర్యవైశ్య కార్తీక సంధ్య అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 24న చంద్రగిరి మండలం తొండవాడ వద్ద ఉన్న శివాలయంలో కార్తీక వనభోజన మహోత్సవం నిర్వహించనున్నట్లు అకాడమీ గౌరవాధ్యక్షుడు దిండుకుర్తి నరసింహులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కార్తీక వనభోజన మహోత్సవం కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్తీక వనభోజన మహోత్సవంలో భాగంగా తొలుత ఉసిరి చెట్టుకు పూజ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. అలాగే లక్కీడిప్ ద్వారా రెండు జంటలను ఎంపిక చేసి వారికి ఉచితంగా అన్నవరం సత్యనారాయణస్వామి దర్శన అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ వనభోజన మహోత్సవంలో ఆర్యవైశ్యులంతా పాల్గొనాలని కోరారు. సమావేశంలో అకాడమీ ప్రతినిధులు పాల్గొన్నారు.


బాధితులకు అండగా ఉంటాం



విద్యార్థినులను పరామర్శిస్తున్న శంకర్ నాయక్

తిరుపతి తుడా : అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న బాధిత విద్యార్థినులకు అండగా ఉంటామని రాష్ట్ర షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ స్పష్టం చేశారు. ఆదివారం రుయా ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న తిరుపతి గిరిజన గురుకుల బాలికల వసతిగృహం విద్యార్థినులను ఆయన పరామర్శించారు. పిల్లలకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాణ్యత లేని ఆహారం వడ్డించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి, నివేదిక వచ్చిన వెంటనే బాధ్యుతలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థినుల ఆరోగ్యం మెరుగుపడిన తర్వాతే ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల నేత మల్లికార్జున పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీనివాస కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వరదయ్యపాళెం : మండలంలోని చిన్న పాండూరు వడ్డిపాళెంలో నూతనంగా నిర్మించిన శ్రీ భూమి నీలాదేవి సమేత శ్రీనివాస ఆలయ కుంభాభిషేక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం స్వామిఅమ్మవార్ల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ముందుగా స్వామి అమ్మవార్లకు అభిషేక పూజలు చేశారు. అనంతరం స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరణ చేసి వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామి కల్యాణాన్ని తిలకించారు. ఆలయ అర్చకులు శంకరాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు సుబ్రహ్మణ్యం , మహేంద్ర, మాధవయ్య, వెంకటేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సూర్య, చంద్రప్రభ వాహనాలపై కైలాస వాసుడు



చంద్రప్రభ వాహనంపై దర్శనమిస్తున్న పార్వతీపరమేశ్వరులు

చంద్రగిరి: తొండవాడ స్వర్ణముఖి నది ఒడ్డున వెలసిన శ్రీఅగస్తేశ్వరస్వామి(ముక్కోటి)వారి ఆలయంలో వారం రోజులుగా రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి, స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఉదయం 6.30 గంటలకు స్వామివారు సూర్యప్రభ వాహనంపై విహరించారు. తదుపరి మధ్యాహ్నం ఆలయ వరణలో కొలువైన మహాలక్ష్మీ అమ్మవారికి అభిషేక సేవ నిర్వహించి, భక్తులకు ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి స్వామి, అమ్మవార్లు చంద్రప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మొగిలి రఘురామిరెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పూలంగిసేవ..

ఉద్రపాదాల ముక్కోటి ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి అమ్మవార్లకు పూలంగిసేవ నిర్వహించనున్నారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు జరుపుతారు. అనంతరం ఉదయం 10.30 నుంచి 12గంటల వరకు పూలంగిసేవను వేడుకగా నిర్వహించనున్నారు.

పోరాటాలకు సన్నద్ధం



ఏఐఎస్ఎఫ్ అరుణపతాకాన్ని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర, జిల్లా నాయకులు

తిరుపతి సిటీ: ప్రభుత్వ విద్యారంగం పరిరక్షణ కోసం సమరశీల పోరాటాలు, ఉద్యమాలకు సన్నద్ధం కావాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.శివారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఎస్వీయూ వేదికగా జరిగి జిల్లా ఏఐఎస్ఎఫ్ ప్రథమ మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. అనంతరం వర్సిటీలో భారీ ర్యాలీ చేపట్టి ప్రకాశం భవనం ఎదుట ఆరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానం వల్ల పేదలకు విద్య అందని ద్రాక్షగా మారుతోందన్నారు. సెంట్రల్ యూనివర్సిటీలలో జాతీయ విద్యా సంస్థల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి సీట్ల సంఖ్యను కుదించి వేయడం వలన ఉన్నత విద్య మరింత ఖరీదుగా మారే అవకాశం ఉందన్నారు. జీవో నం.77ను రద్దు చేస్తానని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారని, ఇచ్చిన మాట మీద నిలబడి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఉపాధ్యక్షులు బండి చలపతి, మాజీ ఉపాధ్యక్షులు మంజునాథ్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మోహన్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉదయ్‌కుమార్, జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

తిరుపతి తుడా: తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని సోమవారం ఉదయం10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు నిర్వహించనున్నట్లు కమిషనర్ మౌర్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ స్థానిక సమస్యలపై అర్జీలు అందించాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. అర్జీదారులు వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జతపరిచి, ఫోన్ నంబర్లను పొందుపర్చాలని కోరారు.

ఘనంగా సామూహిక వన సమారాధన



వన సమారాధనలో పాల్గొన్న తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన తోట కుటుంబాల సభ్యులు

తిరుపతి రూరల్: తిరుపతిలోని దివ్యారామంలో ఆదివారం తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన తోట కుటుంబాల సామూహిక కార్తీకమాస దామోదర వ్రత పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.. ఈ సందర్భంగా అర్చకులు తొలుత కలశ స్థాపన చేసి, గణపతి పూజ, నవగ్రహ శాంతి పూజ చేపట్టారు. తులసి, ఉసిరి మొక్కలకు నూతన వస్త్రాలను అలంకరించి దామోదర వ్రతం, సుమంగళి పూజ శాస్త్రోక్తంగా జరిపించారు. పూజల అనంతరం సామూహికంగా వనభోజనాలు చేశారు. కార్యక్రమంలో తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు తోట బాలాజీ, తోట అమర్ నాథ్ మాట్లాడుతూ తాము ఏటా ఇలా కలుసుకుంటూ పూజలు నిర్వహిస్తూ భక్తి, సేవాభావంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఆకట్టుకున్న కళాప్రదర్శనలు

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతికి చెందిన కోటి ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఆటలు, పాటలు, నృత్య పోటీలను నిర్వహించారు. క్లాసికల్ గ్రూప్ డ్యాన్స్, క్లాసికల్ సోలో డ్యాన్స్, తబలా, పాటలు, కోలాటం , పాశ్చాత్య నృత్యాలు, డ్రాయింగ్, ఫ్యాషన్ షో, స్కిట్ వంటి పోటీల్లో పెద్దఎత్తున పిల్లలు, విద్యార్థులు పాల్గొని ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి ఏఎ ఖాదర్‌వల్లీ సత్కరించి, బహుమతులు ప్రదానం చేశారు.





నృత్యప్రదర్శన ఇస్తున్న చిన్నారులు

ఉత్తరాది మఠం పీఠాధిపతిని కలిసిన టీటీడీ చైర్మన్

తిరుమల: ఉత్తరాది మఠం పీఠాధిపతి సత్యాత్మ తీర్థ స్వామీజీని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మర్యాద పూర్వకంగా కలిశారు. తిరుమలలోని ఉత్తరాది మఠానికి చైర్మన్ దంపతులు ఆదివారం విచ్చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ దంపతులకు స్వామీజీ ఆశీర్వచనం అందించారు. అనంతరం టీటీడీ సనాతన ధర్మవ్యాప్తిని విస్తృతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్వామీజీ చైర్మన్‌కు సూచించారు.

లయన్స్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణస్వీకారం



నూతన అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్‌కు చార్ట్‌ను అందజేస్తున్న అతిథులు

తిరుపతి కల్చరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి శ్రీశ్రీనివాస నూతన కార్యవర్గం ప్రమాణస్వీకార మహోత్సవం ఆదివారం ఓ ప్రైవేటు హోటల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ లయన్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధుల సమక్షంలో నూతన కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. లయన్స్ క్లబ్ తిరుపతి శ్రీశ్రీనివాస వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఆర్కాట్ కృష్ణప్రసాద్, ఉపాధ్యక్షులుగా కేసీ లోకేష్, మబ్బువాసుదేవరెడ్డి, కార్యదర్శిగా జగన్నాథం, కోశాధికారిగా బెల్లంకొండ సురేష్, కోర్డినేటర్‌గా డాక్టర్ జి.వంశి, డైరెక్టర్లుగా ఈశ్వర్‌రెడ్డి, ఈశ్వర్ ప్రకాష్ బి.రఘు, కమలమ్మ, శాంతి ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ మానవసేవే, లయన్స్ క్లబ్ వంటి సంస్థలు పేదల పాలిట పెన్నిధిలా నిలిచి సేవలు అందించడం అభినందనీయమన్నారు. అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవాగుణంతో మెలుగుతూ సమాజ శ్రేయస్సుకు దోహదపడాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీస్సులు



వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దంపతులు, చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

చంద్రగిరి: నియోజకవర్గ పరిధిలోని తమకు ఆత్మీయులైన బంధువులు, శ్రేయోభిలాషుల కుటుంబాల్లో జరిగిన వివాహ మహోత్సవాల్లో చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుటుంబంతో సహా పాల్గొన్నారు. చంద్రగిరి మండలం తొండవాడ సమీపంలోని నారాయణి గార్డెన్స్‌లో జరిగిన ప్రముఖ న్యాయవాది వాణిరెడ్డి, దిలీప్ రెడ్డి కుమారుడు వెంకటేష్, కీర్తిక పెళ్లికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. అదేవిధంగా చంద్రగిరి నియోజకవర్గంలో ఆదివారం జరిగిన పలు వివాహ వేడుకల్లో తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రేమ పెళ్లి చేసుకున్నామని వేధిస్తున్నారు

- భర్త, మామపై అక్రమ కేసులు పెట్టి జైలు పాలు చేశారు
- రక్షణ కల్పించి న్యాయం చేయండి
- బాధితురాలు మౌనిక వేడుకోలు

తిరుపతి కల్చరల్: 'ప్రేమించి పెళ్లి చేసుకున్నామని మా తల్లిదండ్రులు మాపై కక్ష సాధింపులకు పాల్పడుతున్నారు.. తమకు న్యాయం చేయండి' అని పూతలపట్టు మండలం పోలవరం పంచాయతీ చింతమాకులపల్లికి చెందిన పి.మౌనిక కోరారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏడాదిన్నర క్రితం తనకు వరుసకు మేనమామ అయిన ఎస్.చరణ్‌కుమార్, తాను ఇష్టపడ్డామని, అయితే తమ పెద్దలు తిరస్కరించడంతో బయటకు వెళ్లి పెళ్లి చేసుకున్నామని తెలిపారు. అయితే తన ఫ్యామిలీలో తలెత్తిన చిన్నపాటి వివాదాలను ఆసరాగా చేసుకుని గ్రామానికి చెందిన రాజకీయ నేతల అండతో తన తల్లిదండ్రులు ఈశ్వరయ్య, రేవతి పూతలపట్టు పోలీసు స్టేషన్‌లో తన భర్త చరణ్‌కుమార్, మామ, బంధువు సావిత్రిపై గృహహింస కేసు పెట్టి జైలు పాలు చేశారన్నారు. అత్తగారింట్లో ఇబ్బందులకు గురి చేస్తున్నారని తాను ఎక్కడా ఫిర్యాదు చేయలేదని, తన ప్రమేయం లేకుండా తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని తెలిపారు. కేసు పెట్టిన విషయాన్ని తెలియకుండా చేసి తాను గర్భవతిని అని కూడా చూడకుండా మాయ మాటలు చెప్పి తీసుకెళ్లి నిర్బంధించారని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలియడంతో తాను అక్కడి నుంచి తప్పించుకుని పారిపోయి వచ్చానన్నారు. తల్లిదండ్రుల నుంచి తనకు ప్రాణహాని ఉందని, పోలీసు ఉన్నతాధికారులు స్పందించి అక్రమ కేసుల నుంచి భర్త, మామ, సావిత్రమ్మను విడిపించి, తనను భర్త వద్దకు చేర్చాలని విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న బాధితురాలు మౌనిక

గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు

తిరుపతి కల్చరల్/తిరుపతి అర్బన్: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, ఆధునిక సాంకేతిక యుగంలో యువతకు పుస్తక ప్రాశస్త్యం చాటి చెప్పడానికి మరో గ్రంథాలయ ఉద్యమం రావాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు తెలిపారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం తిరుపతి ప్రథమశ్రేణి శాఖ గ్రంథాలయంలో ప్రజా కళావేదిక ఆధ్వర్యంలో ఘనంగా కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తలుగా ప్రముఖ సాహితీ వేత్త, ఏపీ సాహిత్య అకాడమీ మాజీ సభ్యుడు డాక్టర్ వీఆర్. రాసానితో పాటు శ్రీకళా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా హరిసర్వోత్తమ నాయుడు, రచయిత్రి డాక్టర్ కృష్ణవేణి, ఎంఈఓ హేమమాలిని పాల్గొని ప్రసంగించారు.

అత్యుత్తమమైంది పుస్తక పఠనమే..

కార్యక్రమంలో అతిథులు మాట్లాడుతూ విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి, ఆలోచనా పరిధిని విస్తృతం చేసుకోవడానికి పుస్తకాలు దోహదపడతాయన్నారు. ఉన్నత వ్యక్తిత్వాన్ని సంపాదించుకోవడానికి, మనిషికి అనేక మార్గాలు ఉన్నాయని, అన్నింటికన్నా అత్యుత్తమమైంది పుస్తక పఠనమేనని తెలిపారు. పుస్తకాల ఆలయమైన గ్రంథాలయాల పండుగ గ్రంథాలయ వారోత్సవాలని, వాటి గురించి నేటి తరం తెలుసుకోవాలని కోరారు. అనంతరం నిర్వహించిన కవి సమ్మేళనం అందిరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో శ్రీకళా వేదిక వ్యవస్థాపకుడు అరవ జయపాల్, మన్నవ గంగాధర్, గ్రంథాలయ అధికారి జె.శివప్రసాద్, కవులు, కళాకారులు సురేంద్రరొడ్డ, నెమిలేటి కిట్టన్న, పేరూరు బాలసుబ్రమణ్యం, డాక్టర్ కొత్వాలు అమరేంద్ర, యువశ్రీ మురళి, రాళ్లపల్లి రజని, నాగమణి, వెంకటేశ్వర్లు, గోపాల్, రుక్మిణిరెడ్డి, మునిరత్నం, జీఎస్.ప్రసాద్, కృష్ణకుమారి, ఉషారాణి, ఉయ్ సపోర్టు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు తహసున్నీషా బేగం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ వీఆర్ రాసాని